ప్రజాశక్తి
శనివారం 4 మే 2024
I
అల్లూరి సీతారామరాజు



మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముంచింగి పుట్టు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో గిరిజన ప్రాంతాలలోని యువత మృత్యు వాతపడుతున్నారు. మండలానికి చెందిన కుమ్మడ పంచాయతీ పూలబంధ గ్రామంలో కిల్లో వెంకట్రావు భీమవరం రొయ్యల చెరువు వద్దకు ఉపాధికి వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న సమయంలో విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మే 1న మృతి చెందాడు. గురువారం రాత్రి మృతదేహాన్ని పూల బంధ గ్రామానికి తరలించారు. మండల వైస్ ఎంపీపీ 1 పి.సత్యనారాయణ, సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను లు శుక్రవారం గ్రామంలో వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ, మన్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో గిరిజన ప్రాంతంలో ఉన్న యువత మైదాన ప్రాంతాల్లో మృతి చెందుతున్నారన్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఎం నేతలు పాంగి చిన్ని బాబు, గోవింద, కామేష్, పాంగి భాస్కరరావు, చెన్నారావు, దసుర్లయ, లక్ష్మి ఉన్నారు.

పింఛను సొమ్ము కోసం పడిగాపులు

▸▸ బ్యాంకుల వద్ద గంటల తరబడి నిరీక్షణ ▸▸ మండుటెండలో తీవ్ర అవస్థలు

జిల్లాల్లోని బ్యాంకులు, పోస్టాఫీసుల వద్ద పింఛన్ లబ్ధిదారులు శుక్రవారం పడిగాపులు కాశారు. కొంత మంది అకౌంట్లలో డబ్బులు జమ కాకపోగా, పింఛను సొమ్ము జమైన వారు ఆ డబ్బులు విత్ డ్రా చేసుకోవడం తెలియక అనేక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో గంటల తరబడి బ్యాంకుల వద్ద నిరీక్షించారు.



దుంబ్రిగుడ మండలం అరకు సంతబయలు ఎస్‌బిఐ వద్ద బారులు తీరిన పింఛనుదారులు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సీలేరు:జీకే వీధి మండలం సీలేరు యూనియన్ బ్యాంకు, పోస్టాఫీసు వద్ద పింఛన్ లబ్ధిదారులు శుక్రవారం పడిగాపులు కాశారు. కొంత మంది అకౌంట్లలో డబ్బులు జమ కాకపోగా, పింఛను సొమ్ము జమైన వారు ఆ డబ్బులు విత్ డ్రా చేసుకోవడం తెలియక అనేక ఇబ్బందులకు గురయ్యారు. దుప్పిలవాడ పంచాయతీ పరిధి కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ గ్రామాల్లో కొంత మందికి పింఛన్ డబ్బులు జమకాలేదు. సీలేరు పంచాయతీ పరిధిలో 320 మంది లబ్ధిదారులు ఉండగా, 315 మందికి పింఛన్ డబ్బులు జమ కాగా, ఐదుగురికి జమ కాలేదు. ఇదే పరిస్థితి అన్ని పంచాయతీల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతి నెల వాలంటీరు తమ ఇంటికి తెచ్చి ఇచ్చేవారని, ఇప్పుడు నడవలేని స్థితిలో బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన వస్తుందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఉష్ణోగ్రతలు, ఎండ వేడి కారణంగా వృద్ధులు పింఛన్ మాట ఎలా ఉన్నా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పింఛన్ కోసం ఉదయం నుంచి పనులు మానుకొని బ్యాంకు దగ్గర కాపలా కాయవలసిన దుస్థితి నెలకొందని పలువురు లబ్ధిదారులు వాపోయారు. సీలేరు పంచాయతీలో సాంకేతిక కారణాల వల్ల ఐదుగురికి డబ్బులు జమకాలేదని,వారికి కూడా శనివారం నాటికి డబ్బులు జమ అవుతాయని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లోవ కుమారి తెలిపారు.


మోతుగూడెంలో పడిగాపులు

వై.రామవరం : మండలంలోని మారుమూల గ్రామాల వృద్ధులు, ఇతర పింఛనుదారులు ఉదయం ఏడు గంటల నుండి వై.రామవరం స్టేట్ బ్యాంక్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. అధిక సంఖ్యలో లబ్ధిదారులు రావడంతో బ్యాంకు కిటకిటలాడింది. సుమారు 50 కిలోమీటర్ల దూరం ఉన్న రేగడి పాలెం, బులెట్ పాలెం, బూరుగుపాలెం గ్రామాల నుండి వచ్చిన వారు సాయంత్రం వరకు సొమ్ము చేతికి అందకపోవడంతో తీవ్ర ఆందోళన చెందారు. వై.రామవరం రావటానికి బస్సు రోజుకి మూడుసార్లు మాత్రమే తిరుగుతుండడంతో ఇబ్బంది పడ్డారు. పెన్షన్ కోసం వస్తే, బస్ చార్జీలు భోజనానికి రూ.250 ఖర్చయినట్లు లబ్ధిదారులు తెలిపారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఇంటివద్దే పింఛను ఇవ్వాలని వృద్ధులు కోరారు.


సీలేరులో నిరీక్షిస్తున్న వృద్ధులు

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం యూనియన్ బ్యాంక్ వద్ద పింఛన్ సొమ్ము కోసం వృద్ధులు, వింతంతువులు, వికలాంగులు శుక్రవారం పడిగాపులు కాశారు. పెద్ద సంఖ్యలో రావడంతో బ్యాంకు కిటకిటలాడింది. పింఛను డబ్బుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. దూరం నుండి వచ్చిన వారికి వైద్య సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

రాజవొమ్మంగి : మండలంలోని పలు గ్రామాల పింఛన్‌దారులు మండల కేంద్రంలోని బ్యాంకుకు శుక్రవారం కూడా క్యూ కట్టారు. అయితే బ్యాంకులపై అవగాహన లేకపోవడంతో తమ అకౌంటు మనుగడలో ఉందో లేదో తెలియక లబ్ధిదారులు తికమకపడుతున్నారు. మండుటెండలో బ్యాంకుకు వచ్చిన లబ్ధిదారులు తమ అకౌంట్లు బతికించుకోవాలని సిబ్బంది చెప్పడంతో తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

అరకులోయ రూరల్: దుంబ్రిగుడ మండలం అరకు సంతబయలో ఎస్‌బిఐ సేవా కేంద్రం వద్ద ఉదయం నుంచి పింఛనుదారులు పడిగాపులు కాశారు. మండు టెండలో నానా పాట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేసే వెసులుబాటు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పాడేరు: జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల ముందు పింఛనుదారులు బారులు తీరారు. కొందరు తమకు సాయంగా కుటుంబీకులను తోడు తీసుకొని వచ్చి బ్యాంకుల వద్ద నిరీక్షించారు.


పాడేరులో ఎండలో కూర్చున్న పింఛనుదారులు


మండల తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

మండల కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండల కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) నాయకులు శుక్రవారం మండల తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 13న జరుగు సాధారణ ఎన్నికల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగస్తులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకోవడానికి గతంలో అన్ని మండల కేంద్రాలలోనే ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసేవారని గుర్తు చేశారు. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రంలోనే ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం వలన సుదూర ప్రాంతాల నుండి ఉద్యోగులు ఎండవేడిలో నియోజకవర్గం కేంద్రానికి వచ్చి ఓటు వేయడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందని చెప్పారు. ఉద్యోగస్తుల నుండి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని, గతంలో వలే మండల కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకొనే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ముంపు మండలాల నుండి సుదూర ప్రాంతమైన జిల్లా కేంద్రం పాడేరు, అరకు, నియోజకవర్గంలో ఈ ప్రాంత ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీలు వేశారని, వీరు ఆ డ్యూటీలకు సకాలంలో చేరుకొనే విధంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి యస్ జగదీష్, కార్యదర్శి యస్ అజయ్, యస్ రామకృష్ణ, కె రమేష్, వి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- మోతుగూడెం

జిల్లాలోని వై.రామవరం మండలం, డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న 6 కేజీల గంజాయిను పట్టుకొని ఇద్దరు నిందితులను ఎఫ్ఎస్టీ టీం ఇన్‌ఛార్జి ఐ మణికంఠ (ఏఈ, ఆర్డబ్లూఎస్) అదుపులోకి తీసుకొని డొంకరాయి పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఎఫ్ఎస్టీ ఇన్చార్జి ఐ.మణికంఠకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు వై రామవరం మండలం బొడ్డగండి గ్రామ పంచాయితీ పరిధి, రెడ్డి నగర్ గ్రామ శివారులో సీలేరు- డొంకరాయి ప్రధాన రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం వాహనాలు తనిఖీ చేపట్టారు. పల్సర్ బైక్‌పై 6కేజీల గంజాయిని తరలిస్తున్న జగ్గయ్య పేట, వత్సవాయి ప్రాంతాలకి చెందిన కొచర్ల గోపి, మేడా నరేంద్రలను ఎఫ్ఎస్టీ టీమ్ అదుపులోకి తీసుకుంది. మధ్యవర్తుల సమక్షంలో డొంకరాయి పోలీస్ స్టేషన్‌కి అప్పగించారు. డొంకరాయి ఎస్సై శివ కుమార్ కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కి తరలించారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులు

డబ్బును తిరిగి ఇప్పించాలి

- నిరుద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి- పెదబయలు : అరకువేలి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్, ఆర్.ఆర్ రమాదేవి ఇరువురు కలిసి ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారుగా 80 లక్షలు నిలువు దోపిడీ చేసారని, వారి నుండి రికవరీ చేసి న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరారు. మండల కేంద్రంలో బాధితులు మాట్లాడుతూ, అరకు వేలి మహిళా డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్, ఆర్.ఆర్ రమాదేవి అగస్త్య టెక్నాలజీ కంపెనీ (హైదరాబాద్)లో ఉద్యోగాలు ఇప్పిస్తామని సుమారుగా 80 లక్షలు నిరుద్యోగుల నుంచి తీసుకున్నారన్నారు. ఇప్పటికి రెండేళ్లు గడచినా ఉద్యోగాలు లేవని, ఇచ్చిన డబ్బులు తిరిగి రాలేదన్నారు. ఉద్యోగాలు ఇప్పించక పోగా సెల్ నంబర్ కూడా బ్లాక్ చేసారని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. చాలా మంది సుమారుగా ఒక్కక్కరు లక్ష ఏబది వేల వరకు మొత్తంగా 80 లక్షల వరకు ఇచ్చామన్నారు. 2023 సంవత్సరంలో ఈ విషయంపై అల్లూరి జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయగా నేటి వరకు కూడా తమకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు.

వైసిపి గుర్తులతో ఉన్న షర్ట్స్, టోపీలు స్వాధీనం

ప్రజాశక్తి -హుకుంపేట:హుకుంపేట గ్రామ జంక్షన్‌లో వైసిపి గుర్తులతో ఉన్న షర్ట్స్ -752, టోపీలు 2000, స్టికర్ ప్యాకెట్‌లను మోడల్ కోడ్ ఆఫ్ కండాక్ట్ అధికారి రోణంకి వెంకటరావు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సదరు సామాగ్రి, కారుతో పాటు డ్రైవర్, పార్టీ కార్యకర్త కాపు మాధవరావుని అదుపులోనికి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై సతీష్ పేర్కొన్నారు ఎన్నికల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఎన్నికల దృష్టిలో పెట్టుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.


స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి-హుకుంపేట: మండల సర్వసభ్య సమావేశం ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. శుక్రవారం నిర్వహించిన ఈ సమాశంలో ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని సర్పంచ్, ఎంపీటీసీలు, సంతకాలు చేసి ముగించారు.ఎన్నికల అనంతరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కూడా రాజుబాబు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అదికారులు ఉన్నారని, తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కొమ్ము రామ, మజ్జి హరీ, నైని రజిని, సాంబె బాలకృష్ణ పాల్గొన్నారు.


తక్కువగా హాజరైన సభ్యులు

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి

ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, అప్పలనర్స


ప్రచారంలో భాగంగా మీడియాతో మాట్లాడుతున్న అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-రంపచోడవరం

నియోజకవర్గంలోని అన్ని అంశాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిని ఎన్నుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. రంపచోడవరం మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ, సీతంశెట్టి నగర్, ఎస్టీ కాలనీ, రెడ్డి పేట, గంగాలమ్మ వీధి, బందులు దొడ్డి వీధి, గొట్టాలరేవు తదితర ప్రాంతాల్లో శుక్రవారం లోతా రామారావు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పి.అప్పలనర్సను గెలిపించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.అరుణ్ మాట్లాడుతూ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే రంపచోడవరం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి క్రాంతి, మట్ల వాణిశ్రీ, కాంగ్రెస్ నాయకులు బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని మాధవరావు పేట, వీరయిగూడెం, మంగువయి, పెనుబల్లి, ఎటపాక, బజ్జికుప్ప, చందంపేట గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆకిశెట్టి రాము, ప్రసన్నకుమార్, ఇరప సత్యం, గడ్డం స్వామి, కే సత్య పాల్గొన్నారు. మండలంలోని మురుమూరు, నందిగామ, చలంపాలెం ఎర్రగట్టు, రాఘవపురం, గన్నవరం, తోటపల్లి, గుండాల కాలనీ గ్రామాల్లో పిఎన్ఎం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో పిఎన్ఎం రాష్ట్ర నాయకులు మంగరాజు, ఐవి, సిపిఎం నాయకులు ఇరప అజయ్, సోందే రామారావు, కుంజా శ్రీను, కారం జయమ్మ, అపకా సమ్మక్క, పర్సిక ధర్మరాజు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని పెద్దర్కూర్ గ్రామంలో సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ నిర్వాసితుల పక్షాన, రైతుల పక్షాన పోరాడిన సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, ఎంపీటీసీ అమ్మాజి, సర్పంచ్ నాగమణి, బాబు బొర్రయ్య, పాయం సత్యనారాయణ పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలో. జీడిగుప్ప, రాయిగూడెం, ములకపల్లి, వడ్డిగూడెం, గులేటివాడ, నూతిగూడెం, రేగడ గుంపు గ్రామాలలో సిపిఎం నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, పంకు సత్తిబాబు, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ సర్పంచ్ వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, పట్లది రమేష్ ఇతర నాయకులు పాల్గొన్నారు. మండలంలోని గుర్రంపేట, తమ్మాయిపేట, రాజపేట, కుందులూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్‌లు పులి సంతోష్ కుమార్, పూనం సరోజిని, కారం సత్తిబాబు, తొర్రం బాబురావు, సోడి మల్లయ్య, తోడం రాజు, ముసలి సత్యనారాయణ, వీర్ల నాగేశ్వరావు, నల్లారపు చందర్రావు పాల్గొన్నారు.

గిరిజన హక్కులు చట్టాల రక్షణకు కృషి

అనంతగిరి : తనను గెలిపిస్తే గిరిజన హక్కులు, చట్టాల రక్షణకు కృషి చేస్తానని సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స తెలిపారు. మండలంలోని బీంపోలు, గుమ్మకొట, గరుగుబిల్లి గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు.గిరిజన సాగు భూములు అన్యాక్రాంతం కాకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యధర్శి ఎస్.నాగులు, నాయకులు కె సింగులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఇండియా వేదిక బలపర్చిన అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంట, పాడేరు కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబును గెలిపించాలని కోరుతూ మండలంలోని డౌనూరు సంతలో ప్రచారం చేశారు. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నుండి ఆదివాసీలు రక్షింపబడాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం కొయ్యూరు చింతపల్లి మండల కార్యదర్శులు ఎస్.సూరిబాబు పాంగి ధనుంజయ్, నాయకులు వై.అప్పలనాయుడు, కార్యకర్తలు తాంబేలి పిలుపు, జంపా పెంటయ్య, సానా పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం పెదవలస పంచాయతీ రంపుల, డోకులూరు, బంధ వీధి, చాపరాతి పాలెం, బొంతువలస గ్రామాల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం గాలికొండ ఎంపీటీసీ బుజ్జిబాబు, సిపిఎం నాయకులు జి.సత్యనారాయణ, కొర్ర బాలయ్య, సిందరి బాబురావు, గెమ్మెల పరమేశ్వరరావు, పాంగి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండలంలోని మారుమూల ప్రాంత పంచాయతీలైన రంగబయలు, వనుగుమ, కుమ్మడలో ఎంపీ అభ్యర్థి అప్పలనర్స, కాంగ్రెస్ ఎంఎల్ఏ అభ్యర్థి శెట్టి గంగాధర్‌స్వామిలకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు కొర్ర శంకర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్ మాట్లాడుతూ, బిజెపి, టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, మాజీ ఎంపిటిసి ఎస్.రామదాసు, సుందరయ్, చండాల్, దోంబ్రు, సంతాన్న, మంగ్లాన్న, సదురం పాల్గొన్నారు.

పాడేరు : ఉపాధి హామీ పథకం, పోడు భూముల హక్కు పత్రాల పంపిణీ వంటి శాశ్వత సంక్షేమ పథకాలు అమలు కాంగ్రెస్, కమ్యూనిస్టుల కృషియే అని సిపిఎం నేత బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. మండలంలోని జి.ముంచంగిపుట్టు పంచాయతీ పావురాయి, నేరేడువలస, జల్లిపల్లి, కోతపల్లి, పాతరపుట్టు, డోకులూరు తదితర గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జి.ముంచం పుట్టు సర్పంచ్ సత్యనారాయణ, చిట్టిబాబు, బొజ్జన్న. తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోల సేకరి, అరడకోట, గలగండ గంపరాయి, పురుడు పుట్టు సుట్టుమిట్ట, కూతంపుట్టు, గస్సాబు కాంగుల సిడుపుట అల్లంపూర్ బొయిచేలి తదితర గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి అప్పల నర్స, ఎమ్మెల్యే శెట్టి గంగాధర స్వామిలను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు, కొర్ర కోమటి, కుర్ర, కొండబాబు సన్యాసిరావు, సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, పి వీరయ్య, కుర్ర సింహాద్రి, చండా వెంకటరమణ, బుజ్జిబాబు, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.



అరకు వారపు సంతలో చేపట్టిన ప్రచార ర్యాలీలో పాల్గొన్న లోకనాథం, సురేంద్ర

బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు లోకనాథం

దుంబ్రిగుడ : మండలంలోని అరకు వారసంతలో సిపిఎం నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గవర్నమెంట్ హైస్కూల్ నుంచి గ్రామ సచివాలయం మీదుగా వారపు సంతలో ప్రచార ర్యాలీ చేపట్టారు. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.లోకనాథం మాట్లాడుతూ, బీజేపీతో జత కట్టిన టిడిపి, జనసేన పార్టీలతో పాటు బీజేపీతో అంట కాగుతున్న వైసిపి పార్టీకి ఈ ఎన్నికల్లో గిరిజనులు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సిపిఎం నిరంతరం ప్రజల పక్షానే నిలబడుతుందని తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని సవరించి గిరిజన అటవీ సంపదను కార్పొరేట్లకు దారాదత్తం చేసేందుకు బిజెపి, వైసీపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే సురేంద్ర, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు, పి.బాల దేవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, పి.సురేష్ కుమార్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

సిపిఎం ప్రజా సంఘాల్లో పలువురు చేరిక

రాజవొమ్మంగి : మండలంలోని వంచంగి, చికిలింత పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం సిపిఎం నాయకులు చేపట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో భాగంగా పలు పార్టీలకు చెందిన పలువురు సిపిఎం ప్రజా సంఘాల్లో చేరారు. వారికి సిపిఎం నాయకులు పాలిక రాజేంద్ర ఆధ్వర్యంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కాళ్ల రాజబాబు, పాండవుల సత్యనారాయణ, నరేంద్ర, ప్రజా నాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.


సిపిఎం ప్రజా సంఘాల్లో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న సిపిఎం నాయకులు


గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు

నేటి నుంచి 8వ తేదీ వరకు అవకాశం

ప్రజాశక్తి - పాడేరు : స్థానిక తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సంయుక్త కలెక్టర్, పాడేరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికలు 2024లో భాగంగా ఈనెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు 29 పాడేరు ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధులలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు ఈ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని వినియోగించుకొని ఓటు వేయవచ్చన్నారు. ఎన్నికల విధులకు కేటాయించబడి, పాడేరు రిటర్నింగ్ అధికారికి ఫారం-12 సమర్పించిన ఎన్నికల సిబ్బంది (పిఒలు, ఏపిఒలు, ఒపిఒలు, బిఎల్ఒలు, సెక్టార్ అధికారులు, ఎసెన్షియల్ సర్వీసెస్ ఓటర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్లు తదితరులు ఈ ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గంలోని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన హోమ్ ఓటింగ్ ప్రక్రియను ఆర్వో గీతాంజలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైంది. ఈ మేరకు నక్కపల్లి ఆర్వో కార్యాలయం నుండి ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఎన్నికల సిబ్బంది బ్యాలెట్ బాక్స్ లు, సామగ్రిని అందజేశారు. ఏడు టీములు బయలుదేరి వెళ్లారు. పాయకరావుపేట నియోజకవర్గం లో సీనియర్ సిటిజన్స్ (85 సంవత్సరాలు దాటిన వారు), దివ్యాంగులు ఇంటి వద్ద ఓటింగ్ ప్రక్రియ చేపట్టే విధంగా 217 మంది హోమ్ ఓటింగ్ కు దరఖాస్తు చేసుకున్నారు. సెక్టోరల్ అధికారుల ఆధ్వర్యంలో, భద్రత సిబ్బంది పర్యవేక్షణలో హోమ్ ఓటింగ్ చేపట్టారు. నక్కపల్లి, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు ముద్దు సన్యాసమ్మ హోమ్ ఓటింగ్

సమస్యలతో గిరిపుత్రులు సతమతం

తాగునీటికి అవస్థలు..

అసంపూర్తిగా రహదారి నిర్మాణం

ఇదీ కోదండరామపురం గ్రామం దుస్థితి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని కొడవటిపూడి శివారు కోదండరామపురం గిరిపుత్రుల గోడు పట్టించుకునే వారు ఎవరూ లేరు. గ్రామంలో సుమారు 36 కుటుంబాలు 180 మంది ప్రజలు ఉన్నారు. కొడవటిపూడి గ్రామానికి కూతవేటు దూరంలోనే ఉన్నా ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామానికి కనీసం తాగేందుకు నీటి సౌకర్యం లేదు. ఒకే ఒక్క బోరుతో అవస్థలు పడుతున్నారు. గ్రామానికి1.30 కోట్లతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగా వదిలేశారు. రెండు చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోలేదని గిరి పుత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు నామమాత్రంగానే చేసిందని, ఒకవేళ మంజూరు చేసినా కట్టుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామంలో ఇంకా పూరి గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. అసంపూర్తి రోడ్లుకు తోడు సాయంత్రం చీకటి పడితే దారిన వెళ్లేందుకు కనీసం వీధిలైట్లు కూడా లేవు. సుమారు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉన్నందున చీకటి పడితే ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనాటి టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన అంగన్వాడీ భవనం నేటికీ పూర్తికాక అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. దీంతో పూరి గుడిసెలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గ్రామంలో చదువుకునే విద్యార్థులు కొడవటిపూడి వచ్చి చదువుకోవాలని ఉన్నందున రెండు గెడ్డలు దాటి పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. వర్షాలు అధికంగా కురిస్తే చదువుకుంటున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పలువురు విద్యార్థులకు నేటికీ అమ్మఒడి అంత లేదని, స్కాలర్షిప్ కూడా రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కనీసం తాగడానికి నీళ్లు కూడా లేకపోయాయని, రహదారి నిర్మాణం అసంపూర్తిగా వదిలివేయడంతో పలువురు గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండల కేంద్రంలో బాలవికాస్ వారోత్సవాలు వేసవి శిక్షణ తరగతుల సందర్భంగా గైరంపేట భజన మండలిలో వేసవి వెన్నెల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాసి పిల్లలచే తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. 15 మంది బాలవికాస్ పిల్లలు 15 మంది తల్లులు భక్తులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యాన...

ఎండల ప్రాంతాల్లో గుడారాలు ఏర్పాటు



ప్రారంభిస్తున్న కళాశాల కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్

ప్రజాశక్తి -పాడేరు:స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను విస్తృతం చేస్తుంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న తరుణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆదేశాలతో రద్దీ స్థలాలలో గుడారాల టెంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ లోహితస్ తెలిపారు. ఈ సందర్భంగా పాడేరు పట్టణంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో టెంట్ను ఏర్పాటు చేశారు. పాడేరు పట్టణంలో పాత బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో మరో రెండు టెంట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అరకు, చింతపల్లి ప్రాంతంలో రద్దీ స్థలాల్లో మరో రెండు టెంట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సూర్యారావు, జయలక్ష్మి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, జి జి హెచ్ సూపరిండెంట్ డాక్టర్ విశ్వామిత్ర వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

పోలీసుల కవాతు



కవాతు చేపడుతున్న పోలీసులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి, వారిలో భరోసా కల్పించ డానికి పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించినట్లు పాడేరు సిఐ డి.నవీన్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు శుక్రవారం పాడేరు పట్టణంలో కవాతును నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికలకు అంతరాయం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరూ ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రలోభాలకు గురికాకుండా శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా దళాలు పహార పెంచామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ జి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి- అరకు లోయ:పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటుపై అవగాహన పెంచుకోవాలని అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. శుక్రవారం స్థానిక కంఠబౌన్సుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ స్టేషన్ అధికారులకు, ప్రిసైడింగ్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫెసిలిటేషన్ సెంటర్ ఏ విధంగా ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ స్వీకరణ పై అవగాహన కల్పించారు. ఈనెల నాలుగో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వరరావు ఇన్చార్జిగా వ్యవహరిస్తారని చెప్పారు. హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు, ఎస్డిసి వివిఎస్ శర్మ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఐటిబిఐని సందర్శించిన డిఎస్‌టి బృందం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంక్లూజివ్ టెక్నాలజీ బిజినెస్ ఇక్యుబేషన్ (ఐటిబిఐ) కేంద్రాన్ని డిఎస్‌టి నిపుణుల బృందం డాక్టర్ అరవింద్‌కుమార్, డాక్టర్ సిఎస్.యాదవ్ సందర్శించారు. ఇన్నోవేషన్ ఎంటర్‌ప్యూనర్‌షిప్ రంగాల్లో పనిచేస్తున్న విధానాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వివరించారు. ఐటిబిఐ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఆచార్య హెచ్.పురుషోత్తం అతిథులకు స్వాగతం పలికారు. ఐటిబిఐ-సిఇఒ రవి ఈశ్వరపు గత ఏడాది కాలంలో చేసిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి తదితర అంశాలను వివరించారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకుని లాభదాయకంగా పయనిస్తున్న విధానాన్ని తెలియజేశారు. స్టార్టప్ సంస్థల స్థాపనకు భవనాల అవసరం ఉందని, దీనికి అవసరమైన నిధులను డిఎస్‌టి నుంచి అందించాలని కోరారు.

డిఎస్‌టి ప్రతినిధులు ఏయూ ఐటిబిఐ పనితీరును నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరింత అభివృద్ధి చేయడానికి అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, రీసెర్చ్-డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య ఎకెఎం.పవార్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి అనురాధ ప్రచారం

ప్రజాశక్తి - చీడికాడ:సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మాడుగుల నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈ అనురాధ శుక్రవారం మండలంలోని బయలుపూడి గ్రామంలో ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ కూలీలతో కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా అనురాధ, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న తన తండ్రి ముత్యాలనాయుడులకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అనురాధ అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జయమ్మ, మండల పార్టీ కన్వీనర్ రాజబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఐదేళ్ల పాలనలో అంధకారంలో రాష్ట్రం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అంధకారంలోని నెట్టబడిందని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. వస్తున్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి జంక్షన్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల ముందు మద్యపానం నిషేదం అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారన్నారు. 25 రూపాయలు విలువ చేసే మద్యాన్ని 240 రూపాయలకు అమ్మకాలు చేస్తూ పేదల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కనీసం గుంతలు పూడ్చలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం, కొత్తపాలెం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో వైసీపీ హయాంలో అందించిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో 30వేల మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉపమాక, సీతంపాలెం, పెద దొడ్డి గల్లు గ్రామాల్లో శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, నాయకులు కృష్ణ, రమణ, కొప్పిశెట్టి హరిబాబు, సిద్దాబత్తుల నూక తాత పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలకు భరోసా!

రంపచోడవరంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



రంపచోడవరం వీధుల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సిఆర్‌పిఎఫ్, లోకల్ పోలీసులు

ప్రజాశక్తి-రంపచోడవరం : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహణకు ప్రజలకు తామున్నామన్న భరోసా ఇచ్చేందుకు రంపచోడవరం శుక్రవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు, ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టి డిప్లమో కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి, తిరుపతి జిల్లాలో డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విజయనగరం జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాటరల్ ఎంట్రీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ టెక్నాలజీ రెండు మూడు సంవత్సరాల డిప్లమో కోర్సుల కొరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ లోపు ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు అభ్యర్థులు www.iihtvgr.com వెబ్సైట్, 9399936872, 9866169908, 9010243054 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బిజెపిని ఓడించాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ ఇతర ప్రాంతాల నుండి వేలాది మంది కషాయ మూకలను మోహరించి ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండి బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్‌ను ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సిఎం రమేష్ లాంటి పారిశ్రామిక వేత్తలను వలస తీసుకువచ్చి అనకాపల్లి పార్లమెంట్‌లో పోటీ చేయించి బిజెపి ఎలాగైనా గెలవడం కోసం 5వేల మంది కిరాయి మనుషులు తీసుకొచ్చి డబ్బు, మద్యం పంపాకానికి సిద్ధం చేసిందని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదామని, ఇటువంటి వ్యక్తులను పార్లమెంటుకు పంపిస్తే తీవ్ర నష్టం జరుగుతుందన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. మోడీ మరోసారి గెలిస్తే భవిష్యత్‌లో ఎన్నికలు ఉండవని, రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేస్తారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. బిజెపి, ఎన్‌టిసి కూటమిని ఓడించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని వెంకన్న కోరారు.

'సెయింట్ జాన్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట : ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం పంచుమారిలో జరిగిన జాతీయ స్థాయి స్కౌట్ అండ్ గైడ్ అడ్వాన్చరీ పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనుబర్చారుఉ. వీరిలో పదవ తరగతి చదువుతున్న పి మహేష్, ఎన్.కళ్యాణకుమార్, బి.ప్రియాంక, జి.పురుష్ బహుమతులు సాధించారు. వీరిని పాఠశాలలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బి అనురాధ, స్కూల్ డైరెక్టర్ నోబెల్ కుమార్, ప్రిన్సిపాల్ రూపనంద పాల్గొన్నారు.

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి 'లోతా' మానవత్వం!

అర్ధరాత్రి వేళ ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న రామారావు

ప్రజాశక్తి-విఆర్.పురం :మండలంలోని అన్నవరం బ్రిడ్జి వద్ద అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపదలో ఉన్న క్షతగాత్రులను సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు తన వాహనంలో ఆసుపత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

విఆర్.పురం మండలం అన్నవరం బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి ప్రమాదం జరిగి యువకులు తీవ్ర గాయాలతో బ్రిడ్జి కింద పడి ఉన్నారు. ఈ సమయంలో కూనవరం మండలంలో ప్రచారం ముగించుకుని రంపచోడవరం వెళ్తున్న సిపిఎం అభ్యర్థి లోతా రామారావు గాయాలతో పడి ఉన్న క్షతగాత్రులను గమనించి తన కారు ఆపారు. బ్రిడ్జి కింద నుండి క్షతగాత్రులను తనే స్వయంగా తన భుజం మీద ఎత్తుకొని వచ్చి తన వాహనంలో రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యునితో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి -సీలేరు :ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం ఉండాలని, జ్వర బాధితులు కచ్చితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తూరు కోట గ్రామంలో ఆదివాసీలు జ్వరాలతో బాధపడుతున్నారనే విషయాన్ని ఆశ కార్యకర్త విజయ కుమారి వైద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో వెనువెంటనే ఆ గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. మాదిగ మల్లు గ్రామం వరకు వైద్యాధికారి, వైద్య సిబ్బంది అంబులెన్స్‌లో వెళ్లి, అక్కడ నుంచి కాలినడకన వాగులు, వంకలు దాటుకుంటూ గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో 90 మందికి వైద్య పరీక్షలు చేసి, 40 మంది జ్వర బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యాధుల సీజన్ కావడంతో గ్రామాల్లో జ్వరాలు, అతిసార ప్రబలే అవకాశం ఉందని, వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. జ్వర బాధితులకు మలేరియా నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలన్నారు. వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సకాలంలో మెరుగైన చికిత్సలు అందిస్తున్నామని చెప్పారు. ఆదివాసీలు నాటువైద్యం, పసర మందులు జోలికి వెళ్ళవద్దని సూచించారు. పసర మందుల వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతుందని, ప్రాణాలకు నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు.

8న ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరం

దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 8వ తేదీన ప్రత్యేక కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వైద్యాధికారి డీకే హిమబిందు తెలిపారు. అధిక సంతానం వల్ల మహిళల్లోనూ, చిన్నారుల్లోనూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. అధిక సంతానం కలిగిన పురుషులు శిబిరానికి వచ్చి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఏఎన్ఎంలు మత్స్య కొండ, సీతమ్మ పాల్గొన్నారు.

పోలింగ్ సమయం అదనంగా 2 గంటలు పెంచండి

ప్రజాశక్తి-అనకాపల్లి :రాష్ట్రంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయాన్ని అదనంగా మరో రెండు గంటలు పెంచాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకు లేఖ రాసినట్లు లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ లేఖను విడుదల చేసి, మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎండల తీవ్రతను గుర్తించి, ఓటు వేయడానికి వచ్చే వృద్ధుల పరిస్థితిని అంచనా చేయాలని కోరారు. ఎపిలో మొత్తం 4.14 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 46,389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఒక్కో పోలింగ్ కేంద్రంలో సుమారుగా 1500 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఎండకి తట్టుకోలేక సాయంత్రం వచ్చే ఓటర్లుతో పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ పెరిగేకొద్దీ సిబ్బందికి ఇబ్బందులు పెరుగుతాయని, అందుకే సమయం పెంచాలని కోరారు. రాష్ట్రంలో కొంతమంది వాలంటీర్లు అధికార పార్టీకి ప్రచారం చేస్తూ బాధ్యత మరిచి ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కనుబుడ్డి నరసింగరావు, కొలసాని రమణ, ఆడారి శ్రీనివాసరావు, సాలపు మధు పాల్గొన్నారు.

ఏకలవ్య కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు 18లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కొయ్యూరు : ఏకలవ్య మోడల్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలారం ఏకలవ్య మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, హెచ్ఇసీ గ్రూపులకు ఈనెల 3 నుంచి 18వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది పదవ తరగతి పాసైన గిరిజన విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు www.aptwguruku-lam.ap.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు.

గుంతలో పడి దుక్కిటెద్దు మృతి



కేబుల్ గోతిలో పడి మృతి చెందిన దుక్కిటెద్దు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని మర్రివాడ పంచాయతీ లూసం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణం కోసం కేబుల్ వేసేందుకు తవ్విన గోతులో పడి దుక్కిటెద్దు మృతి చెందింది. తీసిన గోతులను పూడ్చకుండా అలాగే వదిలేయడంతో గురువారం పొత్తూరు సన్యాసిరావు అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు ఆ గోతిలో పడి ఊపిరాడక మృతి చెందింది. ఇలాంటి గోతుల్లో పడి మండలంలో పలు గ్రామాల్లో పశువులు మృత్యువాత పడుతున్నాయి. అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలని, బాధిత రైతును ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓటింగ్‌పై అవగాహనకు బీచ్‌రోడ్డులో భారీ ఇవిఎం నమూనా



విశాఖ బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఇవిఎం నమూనా

సార్వత్రిక ఎన్నికల వేళ ఓటింగ్‌పై అవగాహనకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారయంత్రాంగం సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ బీచ్‌రోడ్డులోని పార్కులో భారీ ఇవిఎం నమూనాను ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన దీన్ని పలువురు తిలకిస్తూ, ఎన్నికల గురించి, ఓటింగ్‌పై చర్చించుకోవడం ద్వారా సత్ఫలితాలు వస్తాయని అధికారులు భావిస్తున్నారు. గత ఎన్నికల కంటే మెరుగైన పోలింగ్‌శాతం కోసం అధికారుల వినూత్న చర్యలు ఓటర్లలో చైతన్యాన్ని, ఆసక్తిని కలిగిస్తుండడం విశేషం.

(ప్రజాశక్తి-విశాఖపట్నం)